క్లుప్తంగా

చిన్నారి ఆపరేషన్‌కు దాతల ఆర్థిక సాయం



మనుబోలు : తలలో నెమ్ము చేరి ఇబ్బంది పడుతున్న చిన్నారికి జట్లకొండూరు ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం దాతల సాయంతో ఆపరేషన్ చేయించారు. నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని సోమవారం ఆయన పరామర్శించారు. గోవిందరాజపురానికి చెందిన ఆరేళ్ల చిన్నారి శ్రావ్య తలలో నీరు చేరి అస్వస్థతకు గురైంది. చిన్నారి తల్లిదండ్రులు పేదవారు కావడంతో వారు తులసీరామ్‌ను ఆశ్రయించారు. వైద్య పరీక్షలు చేయించగా ఆపరేషన్‌కు రూ.50 వేలు ఖర్చవుతుందని తెలిసింది. దీంతో ఉపసర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణయ్య, ప్రశాంత్, శ్రీనివాసులు తదితర దాతలు ఆర్థిక సాయం చేసి పాపకు ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం పాప ఆరోగ్యం నిలకడగా ఉంది.

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి



మనుబోలు : వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి నాడు-నేడు పనులను పూర్తి చేయాలని ఏఈఓ అహ్మద్‌బాషా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ మండలంలోని 29 పాఠశాలల్లో నాడు-నేడు పనులను ప్రారంభించామన్నారు. వీటిలో 16 పాఠశాలల ఖాతాల్లో నగదు జమైందన్నారు. మిగిలిన పాఠశాలల్లో జరుగుతున్న పనులకు నగదు అవసరమైతే సర్దుబాటు చేయాలని హెచ్ఎంలకు సూచించారు. ఇప్పటికే పనులు పూర్తయిన పాఠశాలల్లో మిగిలి ఉన్న ప్రభుత్వం సరఫరా చేసిన మెటీరియల్‌ను ఇంకా పనులు జరుగుతున్న పాఠశాలలకు సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమేష్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ మాసు ఆదిశేషయ్య, సీఆర్ఎం టీలు చెంచురామయ్య, స్వరూప, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు



మనుబోలు : ఏప్రిల్ నెలకు సంబంధించి పింఛన్ నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ ప్రసాద్‌తో పెన్షన్ల పంపిణీపై సమీక్షించారు. మండలంలో మొత్తం 5,849 మంది పింఛన్‌దారులు ఉన్నారని, వీరిలో బ్యాంక్ ఖాతాలు ఉన్న 1,471 మందికి మాత్రమే నేరుగా నగదు జమ అవుతుందని తెలియజేశారు. బ్యాంకు ఖాతాలు లేని వారు, నడవలేని వృద్ధులు, వికలాంగులకు సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్ అందజేస్తారని వెల్లడించారు. వారి వెంట ఏఓ రవికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వైభవంగా గరుడసేవ



చేజర్ల: సీతారాముల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి చేజర్ల మండలం మడపల్లి గ్రామంలోని సీతా సమేత కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాముడి ఉత్సవమూర్తిని గరుడ వాహనంపై కొలువుదీర్చి విశేషంగా అలకరించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. గరుడ వాహనంపై కొలువైన కోదండరాముడిని భక్తులు దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

కలిగిరి: కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ ఎస్‌కే ఖాదర్‌వలి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్యం వివరాలు తెలుసుకున్నారు. వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బీ గీతారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు వస్తే కరువే

వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



రోడ్ షో నిర్వహిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం రాష్ట్రం కరువు కాటకాలతో అల్లాడిపోయిందని, పొరపాటున చంద్రబాబు మళ్లీ వస్తే కరువు తాండవిస్తుందని వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రూరల్ మండలం ఆమంచర్లలో సోమవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో అవినీతి మచ్చ లేకుండా పాలన సాగించానన్నారు. తన జీవితంలో ఎవరికీ అన్యాయం చేయలేదని, ఎవరిపైనా కక్ష సాధింపులకు పాల్పడలేదని, చిన్న కేసు పెట్టలేదన్నారు. ప్రతిఒక్కరూ సంతోషంతో ఉండాలని కోరుకునే వ్యక్తినని అన్నారు. చంద్రబాబునాయుడు చెప్పే మోసపూరిత మాటలను నమ్మొద్దని కోరారు. చంద్రబాబు వస్తే ఇప్పుడు పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు నిలిచిపోతాయన్నారు. సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమందరం అండగా నిలవాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ఓటేసి నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయ కుమార్‌రెడ్డి, నాయకులు వైవీ రామిరెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, మాశెం సుధీర్‌కుమార్‌రెడ్డి, బూడిద విజయ్‌కుమార్ యాదవ్, స్వర్ణా వెంకయ్య, సీహెచ్ హరిబాబుయాదవ్, మల్లు సుధాకర్‌రెడ్డి, పుచ్చలపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, బద్దెపూడి రవీంద్ర, చెన్నారెడ్డి హరిచంద్రారెడ్డి, స్థానిక నాయకులు మందర రత్నయ్య, మందర నరసింహులు, కొమ్మి శివాజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నీటిశుద్ధి, వాటర్ బాటిళ్లు, ప్యాకెట్ల తయారీలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎంహెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. కొండాయపాళెంగేట్ సమీపంలో వాటర్ ప్యాకెట్లు రవాణా చేస్తున్న వాహనాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వాటర్ ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీలను ముద్రించకపోవడాన్ని గమనించి వాటిని స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశారు. వాటర్ ప్యాకెట్ల తయారీ సంస్థ యజమాన్యానికి నోటీసులు జారీ చేసి జరిమానా విధించారు. వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీలను ముద్రించకుండా మార్కెట్లోకి పంపిణీ చేస్తే ఆయా వ్యాపార సంస్థలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలోని వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ప్రజారోగ్య విభాగం సూచించిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు.వాటర్ ప్లాంట్ల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు పొందాలని, ఏటా క్రమం తప్పకుండా అనుమతులను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.



వాటర్ ప్యాకెట్లను చూపుతున్న ఎంహెచ్‌ఓ

ఎస్ఎంసీ నిబంధనలు పాటించాలి

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సూచించిన నిబంధనలను వ్యాపార అనుమతులు పొందిన విద్యా, వైద్య సంస్థలు, వాణిజ్య కార్యాలయాలు తప్పనిసరిగా పాటించాలని ఎం హెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. బాలాజీనగర్‌లోని భాష్యం ఇంగ్లిష్ మీడియం స్కూల్, వైకే ఆచారి స్కూల్, సత్యసాయి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, కిడ్జ్ ఇంగ్లిష్ మీడియం విద్యా సంస్థలలో సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ట్రేడ్ లైసెన్స్‌లు, ఎన్ఓసీ సర్టిఫికెట్లు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను ఆయా ప్రాంగణాల్లో పరిశీలించి మెరుగైన చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.

సాహిత్య చరిత్ర గతినే మార్చిన శ్రీశ్రీ

నెల్లూరు(అర్బన్): సమాజంలోని సమస్యలు, పేదలు, శ్రమజీవుల కష్టాలు, కన్నీళ్లనే కవితా వస్తువులుగా చేసుకుని తన సాహిత్యంతో చరిత్ర గతినే మార్చిన మహోన్నత వ్యక్తి శ్రీశ్రీ అని తెలుగుభాషోద్యమ సమితి నాయకుడు చలంచర్ల భాస్కర్‌రెడ్డి అన్నారు. పొదలకూరురోడ్డులోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశ్రీ 114వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తెచ్చే పాటలను, కవితలను గ్రాంధికంలో కాకుండా వ్యవహారిక భాషలో రాసి జాతీయస్థాయిలో అవార్డులను అందుకున్న వ్యక్తి శ్రీశ్రీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, శంకరరావు, శ్రీధర్‌రావు, వాకర్స్ నాయకులు సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చెంచయ్య, విశ్రాంత ఏఎస్పై మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న పీహెచ్‌పీ, జెడ్పీ వాకర్స్ నాయకులు

సంస్కృతి, సంప్రదాయాలకు వారధులు కళలు

నెల్లూరు(బృందావనం): సంస్కృతి, సంప్రదాయాలకు వారధిగా నిలిచే కళలను, వాటికి జీవం పోసే కళాకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించి ఆదరించాలని పద్యకళాపరిషత్ అధ్యక్షుడు, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు మెట్టు రామచంద్ర ప్రసాద్ తెలిపారు. కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో నర్తకిసెంటర్‌లో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ బాల్యం నుంచే చిన్నారులు విద్యతో పాటు కళల్లోనూ రాణించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ డ్యాన్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు, ఔత్సాహక కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. అనంతరం డ్యాన్స్ మాస్టర్ సుజిత్‌కుమార్, సింగర్, డ్యాన్సర్ ఎస్కే అబ్దుల్ తదితరులును ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గాయకుడు, అభినవ ఘంటసాల పాటూరు శ్రీనివాసులు, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ చైర్మన్ నలుబోలు బలరామయ్యనాయుడు, బుల్లితెర నటుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, అరవరాయప్ప, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



మాట తప్పని నాయకుడు సీఎం జగన్



మాట్లాడుతున్న స్వర్ణ వెంకయ్య

నెల్లూరు(దర్గామిట్ట): మాట తప్పని నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు అన్నారు. మాగుంటలేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ దళిత నాయకుడు స్వర్ణ వెంకయ్య మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలిచిందన్నారు. నెల్లూరురూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆదాల ప్రభాకర్‌రెడ్డి దళిత, గిరిజన వర్గాలకు అన్ని విధాలా సాయం అందించారని తెలిపారు. రూరల్ నియోకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాలకీర్తి రవికుమార్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు బద్దిపూడి రవీంద్ర, సీనియర్ పార్టీ నాయకులు ఉదయగిరి నరసింహులుగౌడ్, షేక్ హయాత్‌బాషా, బెల్లంకొండ వెంకయ్య పాల్గొన్నారు.

సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

వరికుంటపాడు: వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి షేక్ ఖాదరవలి అన్నారు. సోమవారం ఆయన వరికుంటపాడు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో పరిధిలో ఆరోగ్య పథకాల అమలు తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెద్దలకు బీసీజీ వ్యాక్సినేషన్, టీబీ రోగులకు అందుతున్న సేవలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కరిష్మా, ఆయేషా, సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ, టీబీ నివారణ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజరు ఎస్.మురళీ, ట్రీట్‌మెంట్ ఆర్గనైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు మోహన్‌కుమార్ మిశ్రాను నెల్లూరు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ ఎం హరి నారాయణన్, ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణపై చర్చించారు.

నెల్లూరు సిటీ బరిలో 15 మంది అభ్యర్థులు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 15 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు కొనసాగిన నామినేషన్ల ప్రక్రియలో మొత్తం 26 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 26న జరిగిన స్క్రూటినీలో 8 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో మరో ముగ్గురు అభ్యర్థులు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వారిలో ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ నుంచి ఎండీ ఖలీల్‌అహ్మద్, టీడీపీ నుంచి పీ నారాయణ, సీపీఐ(ఎం) నుంచి మూలం రమేష్ పోటీ పడుతున్నారు. మరో ఆరుగురు వివిధ పార్టీల నుంచి, మరో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిచారు.

నెల్లూరు రూరల్ బరిలో 11 మంది

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మొత్తం 11 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. అందులో ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ నుంచి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి షేక్ ఫయాజ్ పోటీ పడుతున్నారు. వివిధ పార్టీల నుంచి ముగ్గురు, స్వతంత్ర అభ్యర్థులుగా మరో ఐదుగురు బరిలో ఉన్నారు.

నేడు కరుణశ్రీ కవితలపై ఉపన్యాసం

నెల్లూరు(బృందావనం): చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కరుణశ్రీ కవితారీతులపై ఉపన్యాసాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి వై శేషగిరీశం సోమవారం తెలిపారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తిత్వవికాస నిపుణుడు, విశ్రాంత అధ్యాపకుడు కరిమద్దెల నరసింహారెడ్డి హాజరై ఉపన్యసిస్తారని చెప్పారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడు మెట్టు రామచంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

కార్మికుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో ఉష్ణోగ్రతలు, వడగాలులు అధికమవుతున్న తరుణంలో పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ఆరోగ్యంపై యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కార్మిక అధికారి ఎం వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల తర్వాత పనులు చేయించుకోవాలని సూచించారు.

మృతుడి వివరాలు తెలియజేయండి

నెల్లూరు(క్రైమ్): జీజీహెచ్ ప్రాంగణంలో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి వివరాలు తెలిసిన వారు దర్గామిట్ట పోలీసులకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 25న జీజీహెచ్ ప్రాంగణంలో గోధుమ రంగుపై నలుపు నిలువు చారలు కలిగిన ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, గ్రే కలర్ నైట్ ఫ్యాంట్ ధరించిన సుమారు 55ఏళ్ల వ్యక్తి మృతి చెందారని తెలిపారు. అతని మృతదేహం జీజీహెచ్ మార్చురీలో ఉందని చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు దర్గామిట్ట పోలీసులను సంప్రదించాలని లేదా 0861-2328440 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే సీఎం జగన్ లక్ష్యం



మాట్లాడుతున్న నేహారెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మహిళల ఆర్థిక స్వావలంబనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి అన్నారు. నగరంలోని 3వ డివిజన్‌లో టైలరింగ్, బ్యూటీషియన్, ఇతర కోర్సుల్లో స్వయం ఉపాధి శిక్షణ పొందుతున్న మహిళలతో ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లి సునందరెడ్డితో కలిసి నేహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక ప్రగతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. రాజకీయ పదవుల్లోనూ పెద్దపీట వేసినట్లు తెలిపారు. స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు రుణాల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు వెన్నుదన్నుగా నిలిచిన వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి జగనన్నను మళ్లీగా సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ మొబీనా, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, రాష్ట్ర కార్యదర్శి హిమబిందు, పార్టీ నేతలు మాధవివర్మ, బెందాళం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్‌ను సందర్శించిన జడ్జి



చిన్నారులతో మాట్లాడుతున్న జడ్జి వాణి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని ఆదేశాల మేరకు నగరంలోని బాలసదన్‌ను జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి సోమవారం సందర్శించారు. బాలసదన్‌లోని చిన్నారులకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. భోజనం, వసతి, వైద్య సదుపాయాలపై చిన్నారులను ఆరాతీశారు. అనంతరం వసతి గదులను తనిఖీ చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా జడ్జి దృష్టికి తీసుకురావాలని పిల్లలకు సూచించారు. జడ్జి వెంట లక్ష్మీబాయి, సంపూర్ణమ్మ, తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



18వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న హిమబిందు



21వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న గౌరి



38వ డివిజన్‌లో...

నెల్లూరు సిటీ: సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆదాల హిమబిందు పేర్కొన్నారు. సోమవారం ఆమె తన తండ్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 18వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక కార్పొరేటర్ అశోక్ కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ద్వారా వంశీ, మారంరెడ్డి కుమార్‌రెడ్డి, పుట్టా విజయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

• రూరల్ నియోజకవర్గ పరిధిలోని 38వ డివిజన్ ఆర్టీసీ బస్టాండ్, అరవింద్‌నగర్, టెక్కేమిట్ట, జయభారత్ ఆస్పత్రి, తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు వైవీ రెడ్డి, కల్లూరు లక్ష్మీరెడ్డి, బీ అనితారెడ్డి, మైనార్టీ నాయకులు అల్లాబక్షు, మాజీ కార్పొరేటర్ రజిని, శ్రీధర్, నరసింహారెడ్డి, ఆదిత్య, జిమ్ వంశీ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

నెల్లూరు(బారకాసు): సంక్షేమ సారథి జగనన్నను మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వస్తాయని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి అన్నారు. 21వ డివిజన్ పరిధిలోని ఎన్జీఓ కాలనీలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ నాయకుల మాయమాటలు విని మోసపోవద్దని సూచించారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ అనుభవమంటూ రాష్ట్రానికి ఏం చేయలేదని విమర్శించారు. బాబును గెలిపిస్తే జన్మభూమి కమిటీలు మళ్లీ అరాచకాలు సాగిస్తాయన్న విషయాన్ని గుర్తుంచుకుని విజ్ఞతతో ఓటేయాలని కోరారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, నాయకులు శ్రీధర్ రెడ్డి, సుబ్బారావు, రాజారెడ్డి, సాయిపెంచలనరసారెడ్డి, వెంగళరెడ్డి, శేఖర్, వెంకటరత్నం, బుజ్జన్న, రమణయ్య, మాల్యాద్రి, రియాజ్, సరస్వతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ద్వారకానాథ్



14వ డివిజన్‌లో కరపత్రాలు పంచుతున్న కర్తం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 5వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నుడా చైర్మన్, డివిజన్ ఎన్నికల కోఆర్డినేటర్ ముక్కాల ద్వారకానాథ్ పాల్గొని మాట్లాడారు. డివిజన్ పరిధిలో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీ సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

• నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. త్వరలో జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

యువత ఓటు వినియోగించుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహేంధర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): 18 ఏళ్లు నిండిన యువత ఓటు వినియోగించుకోవాలని నెహ్రూ యువకేంద్రం అధికారి మహేంధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను నెహ్రూ యువ కేంద్రంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పించి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా స్వచ్ఛంద సంస్థల ఎన్నికల నిఘావేదిక కన్వీనర్ బాబాసాహెబ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా, నిష్పక్షపాతంగా వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు త్రిభువనేశ్వర్, బీ శేషాద్రి, సయ్యద్ రాజ్, సయ్యద్ సలార్, తదితరులు పాల్గొన్నారు.